

గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయ: మొహరం సందర్భంగా అరకు మండల కేంద్రంలోని మసీదు వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కిరసాని రాందాస్ ఎండి ఖాన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదర సోదరీ మణులకు శనివారం గొడుగులు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి మొహరం వేడుకలను కొనసాగించారు. ఈ సందర్భంగా కిరసాని రాందాస్ మాట్లాడుతూ, గిరిజన ప్రజల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, అరకు నియోజకవర్గం ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎండి ఖాన్ మాట్లాడుతూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గొడుగులు ఇస్తున్న నాయకులు

గోదావరి ఉధృతి.. ప్రమాదస్థాయిలో శబరి

- చింతూరును చుట్టుముట్టిన వరద
- జలదిగ్బంధంలోనే వందల గ్రామాలు
- మూసుకుపోయిన జాతీయ రహదారి



గోదావరి వరద ఉధృతికి నీట మునిగిన విఆర్.పురం మండలం వడ్డిగూడెం



శబరి వరద ప్రవాహంతో చింతూరులో మునిగిన మార్కెట్

ప్రజాశక్తి-చింతూరు

వరుణుడు కరుణించినా వరద మాత్రం అంతకంతకు పెరుగుతూనే ఉంది. గ్రామాలను, రహదారులను ముంచుతూ విలయతాండవం చేస్తోంది. ఎగువ ఉన్న జలాశయాల నుండి నీరు లక్షల క్యూసెక్కుల్లో వచ్చి చేరడంతో గోదారమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఊళ్ళకు ఊళ్లను ముంచెత్తింది. 15,46,726 లక్షల నీరు దిగువకు విడుదల అవుతుంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రానికి 55.30 అడుగులకు చేరుకుంది. 3వ ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం క్రమేపి పెరుగుతూ 42 అడుగులకు చేరి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుంది. ఇప్పటికే శబరి ఒడ్డు ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. భద్రాచలం వద్ద నీటిమట్టం శనివారం రాత్రికి మరో 3 అడుగులు పెరుగుతుందని సిడబ్ల్యుసి అధికారులు వెల్లడించారు. మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలైన శబరి ఒడ్డు, సంత పాకలు, వాడబజార్, బిసి, ఎస్టీ కాలనీలు, మెడికల్ కాలనీ ప్రజలను ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరించారు.

నిలిచిన రాకపోకలు

ఎటపాక : వరద ఉధృతి పెరగడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎటపాక పోలీసు స్టేషన్ సమీపంలో రహదారిపై వరద నీరు చేరింది. రవాణా సౌకర్యం లేకపోవడంలో గ్రామాల్లోని నిత్యవసరాలు సరిపడా అందడం లేదని, ప్రభుత్వం నిత్యవసరాలు సరఫరా చేయాలని కోరుతున్నారు. శనివారం సాయంత్రానికి 399 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.



పడవపై నుంచి విద్యుత్ పునరుద్ధరణ చేస్తున్న దృశ్యం

భయం గుప్పెట్లో బాధితులు

కూనవరం : గోదావరిలో వరద ఉధృతి పెరగడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. కరెంట్ లేక ముంపు గ్రామాలు పూర్తిగా చీకటి మయం అయిపోయాయి. ప్రజలు తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారు. పునరావాస కేంద్రాలలో శనివారం ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే, ధనలక్ష్మి పర్యటించారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా చూస్తామని తెలిపారు. పాల ప్యాకేట్, కందిపప్పు, ఉల్లి పాయలు కూరగాయలు పంపిణీ చేశారు. అందరికి నష్టం పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

జల దిగ్బంధంలో గ్రామాలు

విఆర్.పురం : శనివారం తెల్లవారుజామున మూడు గంటల నుండి వరద ప్రవాహం పెరగడంతో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వడ్డుగూడెం ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ప్రభుత్వం వాహనాలు ఏర్పాటు చేయకపోవడంతో కొంత మంది సొంత ఖర్చులతో సామాన్లు తీసుకొని వెళ్లగా, పేదలు నెత్తిన, భుజాల మీద సామాన్లు పెట్టుకొని సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేఖపల్లికి చేరుకున్నారు.

కుమ్మూరు గ్రామస్తుల జలదీక్ష

చింతూరు : మండలంలోని కుమ్మూరు గ్రామం వరద నీటిలో మునిగిపోవటంతో శనివారం గ్రామస్తులు వరద నీటిలో దిగి జలదీక్ష చేపట్టారు. కుమ్మురు గ్రామాన్ని 41 కాంటూర్లో కలపాలని, అధికారులు వచ్చి సమాధానం చెపి హామీ ఇచ్చేంతవరకు నీటిలోనే ఉంటామని స్పష్టం చేశారు. పరిహారం ఇవ్వాలని, నిత్యావసర సరుకులు తక్షణమే అందివ్వాలని, రక్షిత తాగునీరు అందివ్వాలని. బోట్ సౌకర్యం కల్పించాలని కోరారు.



జలదీక్ష చేస్తున్న కుమ్మూరు గ్రామస్తులు



పడకలు లేక కింద పరుపులపై కూర్చున్న గర్భిణులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

గర్భిణులకు కనీస వసతులు కల్పించండి : సిపిఎం

కూనవరం : మండలంలోని సిహెచ్‌సిని సిపిఎం ప్రజా ప్రతినిధులు, నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదల సమయంలో ఇబ్బంది పడకుండా ఉండేందుకు విఆర్.పురం, కూనవరం మండలాల్లో నెలలు నిండిన గర్భిణులను సిహెచ్‌సికి తరలించడం జరిగిందని తెలిపారు. వారికి అరకొర సౌకర్యాలు కల్పిస్తున్నారని, సరైన పౌష్టికాహారం అందించడం లేదని పేర్కొన్నారు. మంచాలు ఉంటే పరుపులు లేవని, పరుపులు ఉన్న గదుల్లో మంచాలు లేవని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, ఎంపీటీసీ జయసుధ, సిపిఎం నాయకులు పాయం సీతారామయ్య, మేకల నాగేశ్వరావు, బాబురావు, తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎత్తైన ప్రదేశాల నుంచి విద్యుత్ సరఫరా ఇవ్వాలని వినతి

కూనవరం : మండలంలోని పది పంచాయతీల పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, ఎత్తైన ప్రదేశాల నుంచి విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు తదితరులు కోరారు. ఈ మేరకు మండలంలోని భీమవరం సబ్ స్టేషన్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, త్వరితగతిన కోతులగుట్ట ఆర్ అండ్ బి రోడ్డు నుంచి రేగులపాడు రోడ్డు వరకు, భీమవరం ఎత్తైన ప్రదేశాల నుండి పోలిపారక వరకు విద్యుత్‌ను పునరుద్ధరించాలని కోరారు.

సిపిఎం నాయకులు పరామర్శ



గుడారాల్లో ఉన్న బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విఆర్ పురం

స్థానిక రేఖపల్లి తహశీల్దారు కార్యాలయం చుట్టుపక్కలే గుడారాలు వేసుకొని తలదాచుకుంటున్న వడ్డిగూడెం, ధర్మతల్లాగూడెం, వడ్డిగూడెం కాలనీ గ్రామాలకు చెందిన వరద బాధితులను సిపిఎం నాయకులు శనివారం పరామర్శించారు. ఇక్కడికి వచ్చి మూడు రోజులైనా ఇంత వరకు ఏ ఒక్క అధికారీ పట్టించుకోలేదని బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పూనెం సత్యనారాయణ, సోయం చిన్నబాబు మాట్లాడుతూ మూడు రోజులుగా ప్రజలు నరకం చూస్తుంటే అధికార యంత్రాంగం ఏం చేస్తుందని ప్రశ్నించారు. కిరోసిన్, కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, సోడి మల్లయ్య, కుంజ కన్నయ్య, చల్లా హాజరత్, నూకరాజు, కమ్మిచిచ్చు సత్యనారాయణ పాల్గొన్నారు.

వడ్డిగూడెంలో టిడిపి నాయకులు పర్యటన

విఆర్.పురం : ముంపునకు గురైన మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్ ఆధ్వర్యాన టిడిపి బృందం పర్యటించింది. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముత్యాల రామారావు, బురక కన్నారావు, ఎండి రహీం, బొర్రా నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల ఆదుకోవాలి : మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి

చింతూరు : భారీ వర్షాలు వరదల తాకిడికి తల్లడిల్లి పోతున్న నిర్వాసితులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని, నిత్యాసరాలు తక్షణమే అందజేయాలని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి డిమాండ్ చేశారు. శనివారం ఆమె స్థానిక ఎస్సీ, బీసీ హాస్టళ్లలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులతో మాట్లాడారు. బాధితుల సమస్యలను పీవో దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిన్నారెడ్డి. ఓబుల్లనేని రామారావు చౌదరి, మల్లెల వెంకటేశ్వరరావు, రియాజ్ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడంలో విఫలం

కూనవరం : వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మండలాధ్యక్షుడు బరపాటి ప్రకాష్, నోముల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు షరీఫ్ ఆరోపించారు. శనివారం వారు పునరావాస కేంద్రాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు.

కందిపప్పు మాత్రమే ఇచ్చారు



మమ్మల్ని అధికారులు రెండు రోజుల క్రితం బిసి హాస్టల్లో తెచ్చి పడేశారు. కేవలం కేజీ కందిపప్పు మాత్రమే ఇచ్చారు. పప్పు తిని ఎలా బతకాలి. తాగునీరు లేదు. బియ్యం లేవు. హాస్టల్లో మొత్తం 20 కుటుంబాలు నివాసమున్నాయి. వర్షానికి స్లాబ్ కారిపోతుంది. ఫ్యాన్లు లేక దోమలతో సహవాసం చేస్తున్నాం.

- మెల్లెం సీతమ్మ, సంతపాకలు, చింతూరు

అన్ని రకాల నిత్యావసరాలు ఇవ్వాలి



గోదావరి పెరుగుతుందని, వెంటనే ఖాళీ చేయాలని అధికారులు చెప్పి ఈ హాస్టల్ చూపించారు. మా సొంత ఖర్చులతో ఆటోలో సామాన్లు సర్దుకుని బీసీ హాస్టల్‌కు వచ్చి చేరాం. కానీ రెండు రోజులైనా నిత్యావసరాలు ఇవ్వలేదు. ఏ అధికారి వచ్చి మా బాధలు చూడలేదు. తక్షణమే నిత్యావసర వస్తువులు అందజేయాలి.

- సింధే సులోచన, సంత పాకలు, చింతూరు

సహాయక చర్యలకు సర్వం సిద్ధం

కలెక్టర్ సుమిత్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చింతూరు

చింతూరు డివిజన్ 4 మండలాలలో వరద బాధితులకు సహాయక సహకారాలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఛాంబర్‌లో పాత్రికేయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. చింతూరు మండలంలో సుమారు 8500 కుటుంబాలు ఉండగా సుమారు 4వేల కుటుంబాలు, విఆర్ పురం మండలంలో 8500 కుటుంబాలకు, 4వేల కుటుంబాలు, కూనవరం మండలంలో 8వేల కుటుంబాలకు 6వేల కుటుంబాలు, ఎటపాక మండలంలో 10 శాతం కుటుంబాలు ముంపునకు గురైనట్లు తెలిపారు. సుమారు 5వేల ఇండ్ల దగ్గరకు నీరు వచ్చిందన్నారు. శనివారం నుండి వరద సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు చెప్పారు. ముంపు బాధితులకు పాలు, కిరోసిన్, 35 వేల కొవ్వొత్తులు, టార్పాలిన్లఉ ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు. కొన్ని గ్రామాలకు కరెంటు కట్ అయిందని, వరదలు తగ్గిన వెంటనే పునరుద్ధరించడం జరుగుతుందని పేర్కొన్నారు. నాలుగు మండలాల్లో సుమారు 250 గ్రామాలు ముంపునకు గురైనట్లు అంచనా అని తెలిపారు. వరద సహాయంపై ముంపు బాధితుల జాబితా ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, కొన్ని గ్రామాలకు లాంచీలు, కొన్ని గ్రామాలకు కంట్రీ బోట్లు, మరికొన్ని గ్రామాలకు వాహనాలలో బియ్యం, పప్పు, కూరగాయలు పంపించి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.



కూరగాయలు సరఫరాను పర్యవేక్షిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

బాధితులకు కూరగాయలు : ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి-చింతూరు : వరద బాధితులకు కూరగాయలు అందిస్తున్నట్లు చింతూరు ఐటిడిఎఇ ఇన్‌ఛార్జి పిఒ సూరజ్ గనోరే తెలిపారు. శనివారం ఉదయం స్థానిక జిసిసి గొడౌన్ నుండి కూరగాయలు వరద ప్రాంతాలకు చెరవేసే లాంచీలను ఐటిడిఎ పిఒ పరిశీలించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిసిసి గొడౌన్ నుండి విఆర్.పురం, కూనవరం మండలాలకు ఒక్కో మండలానికి మూడు టన్నుల ఉల్లిపాయలు, మూడు టన్నుల బంగాళాదుంపలు, రెండు టన్నుల కూరగాయలు పంపించినట్లు చెప్పారు. కార్యక్రమం డిఎస్ఓ గణేష్ కుమార్, జిసిసి డిఎం మధు, ఎఎంఒ సి.శ్రీహరి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

చింతూరు : వరద ముంపు వల్ల గ్రామాలను వదిలి పునరావాస కేంద్రాల్లో ఉంటున్న మండలంలోని ఎజి కోడేరు పంచాయతీ పరిధి ఎజి కోడేరు, ఉలుమూరు, మల్లెతోట గ్రామాల 917 కుటుంబాలకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలు, కిలో దొండకాయలు, కిలో కందిపప్పు, లీటరు పాల ప్యాకెట్ అందజేశారు. కార్యక్రమంలో ఎజి కోడేరు ఎంపీటీసీ జల్లి లావణ్య, సర్పంచ్ అగరం సుబ్బలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి జి.జగదీవన్, సచివాలయం సిబ్బంది ఎ.ప్రవీణ్, ఐ.పతి, భారతి, దివ్య, నాగరాజు పాల్గొన్నారు.

రేఖపల్లిలో పారిశుధ్య పనులు

విఆర్.పురం : రేఖపల్లిలోని పునరావాస గుడారాలు, రేఖపల్లి గ్రామంలోనూ సర్పంచ్ పూనెం సరోజిని ఆధ్వర్యాన పారిశుధ్య కార్మికులు బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ గుడారాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శి శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడారాల్లో బాధితులకు బిర్యానీ పంపిణీ

శ్రీనృసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో విఆర్ పురం మండలం రేఖపల్లి పునరావాస గుడారాల్లో ఉంటున్న వరద బాధితులకు వెజిటబుల్ బిర్యానీ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, సంస్థ ప్రతినిధులు బొర్రా నరేష్, ఎం.మధు, సాయి, పోసి రాజు, అన్నమయ, తేజ, అప్పాజీ, సాయిరాం పాల్గొన్నారు.

31న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ఈనెల 31న చేపట్టనున్న చలో కలెక్టరేట్ ముట్టడిని మధ్యాహ్నం భోజన కార్మికులు జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయం వద్ద శనివారం మధ్యాహ భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం రూ.26,000 వేలు ఇవ్వాలన్నారు. మెనూ చార్జీల బిల్లులు, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాలు సిఐటియు మండల అధ్యక్షురాలు ఎస్ విజయమ్మ, మధ్యాహ్న భోజన కార్మికులు పి.రఘు, కే.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఆసుపత్రికి తరలించేందుకు అవస్థలు

ప్రజాశక్తి-పాడేరు: మండలంలో అనేక మారుమూల గ్రామాలకు రహదారుల సౌకర్యం లేక గిరిజనుల వేదన అరణ్య రోదనగా మారుతోంది. మండలంలోని దేవాపురం సలుగు పంచాయతీల్లోని మారుమూల గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం లేని దుస్థితి ఉంది. దీంతో, ప్రమాదాలు జరిగినప్పుడు వీరికి తక్షణ వైద్య సేవలు అందని పరిస్థితి ఉంది. సలుగు పంచాయతీలోని దబ్బగరువు గ్రామానికి చెందిన 15 ఏళ్ల గిరిజన బాలిక జర్త శాంతి కుమారి మేకలు కాయడానికి శుక్రవారం మధ్యాహ్నం అడవికి వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడడంతో ఎడమ కాలికి తీవ్రంగా గాయపడింది. కదలి లేని స్థితిలో గాయ పడి ఉన్న ఈ బాలికను కొంతసేపటికి చుట్టుపక్కల వారు గుర్తించి ఆ రాత్రికి గ్రామానికి చేర్చారు. మరుసటి రోజు ఉదయం ఆ బాలికను కుటుంబ సభ్యులు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డోలిమోతతో తరలించి వైద్య సేవలు కల్పించారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వైద్య సేవలు అందించడానికి ఒక రోజంతా నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురైందని గిరిజనులు తెలిపారు.



డోలీలో తరలిస్తున్న కుటుంబీకులు

ఖనిజ సంపదను తరలించేందుకే..

మణిపూర్‌లో బిజెపి అల్లర్లు

-ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై ఆర్ఎస్ఎస్, బిజెపి జరుపుతున్న దాడులకు వ్యతిరేకంగా రాష్ట్ర ఏజెన్సీ ప్రాంత బంద్‌కు పిలుపునకు ఆలోచిస్తున్నట్లు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లోత రామారావు, కిల్లో సురేంద్ర తెలిపారు. ఈ సంద్భంగా వారు శనివారం అరకువేలి ఆదివాసి గిరిజన సంఘం కార్యాల యంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 27న విశాఖలో జరిగిన ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ బంద్‌కు మద్దతు ఇచ్చే ఆదివాసీ గిరిజన ప్రజా సంఘలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. మణిపూర్ ఆదివాసీ ప్రాంతంలో 6వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, గ్రామసభ రద్దు చేసి అత్యంత విలువైన ఖనిజ సంపద, మైనింగ్‌ను బడా కార్పొరేట్ కంపెనీలకు బీజేపీ ప్రభుత్వం ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ప్రాంతంలో ఉన్న అపారమైన సహజ వనరులు పెట్టుబడి దారులకు అప్ప జెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం అటవీ పర్యావరణ సంరక్షణ చట్టం సవరణ బిల్లును ఆమోదించిందని, దీంతో గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల ఆదివాసీలకు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బోయ/వాల్మికిలను గిరిజన జాబితాలో చేర్చి రాష్ట్రంలో ఆదివాసీ తెగల మధ్య చిచ్చు పెట్టి మరో మణిపూర్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నం చేయాలని చూస్తున్నాయన్నారు. వైసీపీ, టీడీపిలు కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి ఆదివాసి గిరిజనులకు తీవ్ర ద్రోహం చేస్తున్నామని, దీన్ని ఆదివాసీ గిరిజన సంఘం తిప్పికొడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పి రామన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేంద్ర, రామారావు

వర్షాల కారణంగా..

కూలుతున్న రక్షణ గోడలు

ప్రజాశక్తి-అనంతగిరి: గత పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అనంతగిరి, అరకు ఘాట్ రోడ్డులో పలుచోట్ల రక్షణ గోడలు కూలుతున్నాయి, శివలింగపురం, టైడా, డముకు, ములియాగూడ, అనంతగిరి, బీసుపురం వంటి ప్రాంతాలలో ఎక్కడ పడితే అక్కడ రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడలు కూలుతున్నాయి. డ్రైనేజీ, కల్వర్టులు ఏర్పాటు చేయక పోవడంతోనే వర్షపు నీరు రోడ్డుపైకి ప్రవేశించి రక్షణ గోడలు దెబ్బతింటున్నాయి. ఈ మధ్యకాలంలో చిలకలగెడ్డ నుండి కాశీపట్నం, శివలింగపురం, టైడా, డమ్ముకు, అనంతగిరి ఘాట్ రోడ్‌లో ఎయిర్టెల్ కేబుల్ లైన్ ఏర్పాటుకు కాలువ తవ్వకం చేపట్టారు. దీంతో రక్షణ గోడలకు కొంత మేర దిబ్బతిన్నాయి. దీంతో, ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం రక్షణ గోడల మరమ్మతు చేపట్టాలని పలువురు కోరుతున్నారు



దెబ్బతిన్న గోడ



కూలిన రక్షణ గోడ

పాడైన చికెన్‌తో నూడిల్స్

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని అనంతగిరి, ములియగుడ, డముకు, తుమ్మసలవలస, కాశీపట్నం, బొర్రా వంటి ప్రాంతాలలో నిల్వ ఉంచిన చికెన్‌తో నూడిల్స్ అమ్మకాలు చేపడుతున్నారు. తుమ్మసలవలస మెయిన్ రోడ్డుకు ఆనుకొని రెండు చోట్ల నూడిల్స్ షాపులు ఉన్నాయి. ఆంజనేయ గుడి పక్కన ఉన్న నూడిల్స్ షాప్‌లో పాడైన చికెన్ నూడిల్స్ తయారు చేస్తూ విక్రయాలు చేపడుతున్నారు. వీటిని తినడంతో పలువురు వాంతులు, విరోచనాలకు గురయ్యారని, దీనిపై షాపు యజమానిని అనేకసార్లు నిలదీసినప్పటికీ మార్పు రాలేదని పలువురు తెలిపారు.


ఎన్జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను సత్కరిస్తున్న కెకె.రాజు

ఎన్జీజీవోస్ కాలనీ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-మధురవాడ : నూతనంగా ఎన్నికైన ఎన్జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం జివిఎంసి 49వ వార్డులోని వైభవ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా వైభవ వెంకటేశ్వర స్వామిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు సమక్షంలో కమిటీ ప్రెసిడెంట్ పార్వతీశం, వైస్ ప్రెసిడెంట్ పి.బలరామస్వామి, సెక్రటరీ కె.రామచంద్రరాజు, జాయింట్ సెక్రటరీ డి.ఎస్.కృష్ణమోహన్, డైరెక్టర్లు ఎ.ఎస్.సాంబశివరావు, ఆర్‌వి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, రాజారావు, వివేక్ స్వరూప్, ఎంవి.స్వరూప్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో 25, 51వార్డు కార్పొరేటర్లు సాడిపిల్లి గోవింద్, రెయ్యి వెంకటరమణ, జి. ప్రసాద్, ఎన్.రవికుమార్, ఐ.రవికుమార్, 49వ వార్డు నాయకులు ఆదిరెడ్డి శ్రీను, శకుంతల, కిశోర్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సంరక్షణ ప్రచారకునికి సన్మానం

ప్రజాశక్తి-మధురవాడ : భవిష్యత్ తరాలు కాలుష్యం భారిన పడకుండా పుడమి తల్లిని కాపాడుకోవాలని ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు సైకిల్‌పై భారత యాత్ర చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన 21 ఏళ్ళ యువకుడు, పర్యావరణ ప్రచారకర్త మోహిత్ నిరంజన్‌కు భారత ప్రజా సంబంధాల సంఘం (పిఆర్‌ఎస్ఐ) శనివారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పిఆర్‌ఎస్ఐ విశాఖ శాఖ ఛైర్మన్ ఎమ్‌కెవివిఎల్.నరసింహం మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో ప్రమాదకర క్రిమి సంహారకాల వాడకం, పట్టణాలలో ప్లాస్టిక్ వినియోగం, అతిగా భూగర్భ జలాలను వాడటం, నదులను కలుషితం చేయడం భూమిపై ఒత్తిడిని పెంచుతోందన్నారు. సేవ్ సాయిల్ (మట్టిని రక్షించు) నినాదంతో మోహిత్ నిరంజన్ చేపట్టిన కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మోహిత్‌కు పిఆర్‌ఎస్ఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ పివిఎస్.మూర్తి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేసి సన్మానించారు. పర్యావరణ ప్రచారకర్త మోహిత్ నిరంజన్ మాట్లాడుతూ, భూసారం క్షీణించడం వల్ల భూగ్రహం మీద పెరిగే వృక్షసంపదలో అరవై శాతం ఉత్పాదక పడిపోతుందని, 2050 నాటికి భూమి మీది 90 శాతం నేలలు క్షీణించవచ్చని చెప్పారు. ఈ విషయంపై ప్రజలను చైతన్య పరుస్తూ ఇప్పటి వరకూ 7000 కిలోమీటర్లు సైకిల్ యాత్ర పూర్తి చేశానని, మరో 3000 కిలో మీటర్లు ప్రయాణించి కోయంబత్తూర్‌లోని ఇషాయోగా కేంద్రాన్ని చేరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిఆర్‌ఎస్ఐ కార్యదర్శి ఎ.గోవిందరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - గాజువాక : గాజువాక ఇండస్ట్రియల్ ఏరియా ప్రయివేటు పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా) ఆధ్వర్యాన యశోద పబ్లిక్ స్కూల్లో శనివారం ప్రయివేటు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ సహాయంతో ఎంఇఒ ఎం.సునీత ప్రారంభించారు. పాఠ్యాంశాలపై, నూతన పరీక్షా విధానాలపై శిక్షణ అందించారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులు భూషణరావు, దివాకర్, అప్పలరాజు, విశ్వరావు, అప్పారావు, జగేష్, ప్రసాద్, పద్మజ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్షంతో కోతకు గురైన రోడ్లు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని గత పది రోజులుగా ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మారుమూల గిరిజన గ్రామాల రోడ్లు కోతకు గురవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలానికి మారుమూల ఉన్న పెద్దకోట, పిన్నకోట పంచాయతీ పరిధిలో 12 .గ్రామాలకు విస్తరించి ఉన్న రోడ్డు గోతుల మయంగా మారింది. బొర్రాపల్లేం, చటకంబ, జగలడమామిడి, తంగెళ్లబంధ, బోనూరు, గంగవరం, చీడిమెట్టు, తాంగేవలస, గడ్డిబంద గ్రామాలకు విస్తరించి ఉన్న రోడ్డు పూర్తిగా గోతులుగా ఏర్పడి ద్విచక్ర వాహనాలు, అంబులెన్స్ వంటి వాహనాలు తిరుగులేని పరిస్థితిలో ఉంది. రోడ్డు అంతా పాడైపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వైద్యం, సామగ్రి రవాణాకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పూర్తిస్థాయి రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు


కోతకు గురైన రోడ్డు


వ్యక్తిగత భద్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రం శ్రీకృష్ణాపురం బాలికల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వ్యక్తిగత భద్రత, ఆరోగ్యం, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 8,9,10 తరగతి విద్యార్థులు స్వచ్ఛందంగా రెడ్ క్రాస్‌లో వాలంటీర్లుగా చేరేందుకు ముందుకు వచ్చారు. ప్రతి బుధవారం, శనివారం ఆశ్రమ పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని రెడ్ క్రాస్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు జయలక్ష్మి, గౌరీ శంకర్, సూర్యారావు, కోఆర్డినేటర్ లోహితస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మోక్షారోపణ మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : జ్ఞానాపురంలోని పునీత పేతురు ప్రధాన దేవాలయం ఆధ్వర్యాన దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని దేవాలయ విచారణకర్త ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆలయ ప్రధాన కార్యాలయంలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సదర్భంగా జాన్‌ప్రకాష్ మాట్లాడుతూ, జ్ఞానాపురంలో ఏటా ఆగస్టు 1 నుంచి మరియమాత స్వరూప తేరును 14 రోజులపాటు ఊరేగించి 15వ తేదీన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 1న చర్చిలో దివ్య పూజ అనంతరం సాయంత్రం 7.30 గంటలకు సిలువ గుర్తు మండపంలో మహోత్సవ జెండా ఆవిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 6వ తేదీ సాయంత్రం 6.30 గంటల నుంచి 14వ తేదీ వరకు దేవాలయంలో నవదిన ప్రార్ధనలు జరుగుతాయన్నారు. 15న మహోత్సవ సమిష్టి దివ్య పూజబలిని విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ నిర్వహిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో పునీత పేతురు ప్రధాన దేవాలయ సహాయ విచారణకర్తలు ఫాదర్ పి.ప్రభాకర్, కె.వేళాంగిణిరాజు, పిసిసి అధ్యక్షుడు యుద్ధా ఆమర్స్, కార్యదర్శి పి.ఆనంద్, కోశాధికారి జి.ఆనందరావు, ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి చార్లీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్నజాన్‌ప్రకాష్ తదితరులు

11న చలో అడ్మిన్ బిల్డింగ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : కాంట్రాక్టు కార్మికులకు నిలిపివేసిన రూ.2400 వెంటనే చెల్లించేందుకు చర్యలు చేపట్టకపోతే ఆగస్టు 11న వేలాదిమంది కార్మికులతో చలో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ కార్యక్రమం చేపట్టాల్సి ఉంటుందని స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి.శ్రీనివాసరావు ఉక్కు యాజమాన్యాన్ని హెచ్చరించారు. డబ్ల్యుఆర్‌ఎం డిపార్టుమెంటు వద్ద జరిగిన హెచ్‌ఒడి ఆఫీసు దిగ్బంధం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వారం రోజుల్లో పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని యాజమాన్యం నిలబెట్టుకోలేక పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో వైపు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులపై దాడి చేస్తోందని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని మట్టి కరిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక నాయకులు నమ్మి రమణ, కెపి.సుబ్రహ్మణ్యం, చట్టి నర్సింగరావు, నందికి తాతారావు, మురళీకృష్ణ, కోన రమణ, అవతారం, పిట్ట రెడ్డి, పితాని భాస్కరరావు, ఎన్ కృష్ణ సూర్య కుమార్, నమ్మి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఎంఎంఎస్ఎమ్, డబ్ల్యుఆర్ఎం హెచ్‌ఒడిలకు వినతిపత్రం అందజేశారు.

నేరాలు ఘోరాలు


మృతి చెందిన యువకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: బైక్‌పై నర్సీపట్నం వస్తుండగా స్కేటింగ్ స్టేడియం వద్ద శుక్రవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో విద్యుత్ స్తంబాన్ని ఢీ కొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందినట్లు నర్సీపట్నం టౌన్ పోలీసులు తెలిపారు. నర్సీపట్నం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై వస్తున్నారు. లో విద్యుత్ స్తంబాన్ని ఢీ కొనడంతో విష్ణు, హరి ప్రసాద్ అక్కడి కక్కడే మరణించారని, మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

'విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై స్పందన అనవసరం'

ప్రజాశక్తి -గాజువాక : విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై తాను స్పందించాల్సిన అవసరం లేదని, కేవలం పార్టీ అభివృద్ధిపై మాత్రమే దృష్టి సారించామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా గాజువాక వచ్చిన ఆమె పాత గాజువాక కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం చినగంట్యాడ పద్మశ్రీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ప్రముఖ్‌ల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశాభివృద్ధికి నరేంద్ర మోదీ నాయకత్వం ఎనలేని కృషి చేస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు అండగా ఉంటామని చెప్పారు. వారు కోరేవిధంగా కేంద్రానికి తాము కొన్ని సూచనలు చేశామని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలోని పలు పరిశ్రమల కార్మిక నేతలు ఆమెకు వినతిపత్రాలు అందజేశారు. కెఎన్‌ఆర్ ఆధ్వర్యాన పురందేశ్వరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ జివిఎల్.నరసింహారావు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మేడపాటి రవీంద్ర, సూర్యనారాయణ రాజు, పుట్టా గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈట్ రైట్ మిల్లెట్ మేళా మారథాన్

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో ఈట్ రైట్ మిల్లెట్ మేళాను సిఎమ్‌డి అతుల్‌బట్ ప్రారంభించారు. ఉక్కునగరం క్లబ్ మల్టీపర్పస్ హాల్లో ప్రారంభమైన ఈ మారథాన్‌లో సుమారు వెయ్యి మందికిపైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతుల్ బట్ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా ఆరోగ్యకరమైన ఆహార విప్లవం ప్రారంభమైందని, మిల్లెట్ల విలువ ప్రజలకు అర్థమవుతుందని చెప్పారు. మధుమేహం దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల్లో తృణధాన్యాల పట్ల ఆసక్తి పెరిగిందన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వివిధ కేటగిరీల క్రింద ఏర్పాటుచేసిన 26 స్టాల్స్‌ను సిఎమ్‌డి ప్రారంభించారు. మిల్లెట్ ఆధారిత తినుబండారాలపై అవగాహన కల్పించారు. వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విఎస్‌జిహెచ్‌సి జిఎం ప్రకాష్ పాల్గొన్నారు.

ఇనార్బిట్‌మాల్ శంకుస్థాపన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : రహేజా గ్రూప్ ఆధ్వర్యాన పోర్టు హాస్పిటల్ సమీపంలో ఆగస్టు 1వ తేదీన ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజిని పరిశీలించారు.


సిఐని మర్యాదపూర్వకంగా కలిసిన రఘునాథరావు

జడ్డంగి ఎస్ఐగా రఘునాథరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి ఎస్ఐగా టి రఘునాథరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా పోలాకి గ్రామానికి చెందిన రఘునాథరావు 2015 బ్యాచ్‌కి చెందిన వారు. ఆయన గతంలో ఇంటిలిజెన్స్ విభాగంలోను, కాకినాడ జిల్లాలో జగ్గంపేట ఎస్ఐగా, అనంతరం కిర్లంపూడి ఎస్ఐగా పని చేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు జడ్డంగి ఎస్ఐగా పనిచేసిన షరీఫ్ కాకినాడ జిల్లాకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై రఘునాథ రావు రాజవొమ్మంగి సీఐ బాకీలాల్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఎస్ఐను జడ్డంగి స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. శనివారం విశాఖ దక్షిణ నియోజకవర్గ సమీక్షా సమావేశం ఆమె అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగింది. టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జిల్లా అధికారులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో వివిధ అంశాలపై చర్చించారు. రెవెన్యూ, జివిఎంసి, నాడు -నేడు, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ముందుగా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జరుగుతున్న అభివద్ధి పనులుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజా ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి రజని మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో జిఒ 388 ద్వారా 185 అభ్యంతరం లేని ఆక్రమణలకు కన్వేయన్స్ డీడ్ పొందేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 169 మందికి కన్వేయన్సు డీడ్ పూర్తి చేశామన్నారు. అల్లిపురం వెంకటేశ్వర స్వామి దేవాలయానికి చెందిన భూముల ఆక్రమిత నివాసదారులకు రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సమస్యలు ఉన్నందున వెంకటేశ్వరస్వామి దేవాలయానికి ఆ భూములకు బదులుగా అగనంపూడి, పెద గంట్యాడ మండలంలో 7.32 ఎకరాల భూమి మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా సీతారామ స్వామి దేవాలయానికి సంబంధించిన భూములలో ఆక్రమిత దారుల భూమికి బదులుగా దేవాలయానికి భూమి గుర్తించాలని ఆర్‌డిఒను ఆదేశించారు. టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ దక్షిణ నియోజికవర్గం పరిధిలో విశాఖ పోర్టు వల్ల ప్రజలకు కాలుష్య సమస్యలు అధికంగా వస్తున్నాయని, షెడ్స్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. గ్రీనరీని మెరుగుపరచాలన్నారు.

ఘనంగా శ్రీభరత్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి విశాఖ పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌ఛార్జి, గీతం విద్యాసంస్థల అధినేత ఎం.శ్రీ భరత్ జన్మదిన వేడుకలు టిడిపి కార్యాలయంలో పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మళ్లీ వచ్చే జన్మ దినోత్సవం నాటికి లోక్‌సభ సభ్యునిగా శ్రీభరత్‌ను చూడాలని, అందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జ్ కోరాడ రాజబాబు, జివిఎంసిలో టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఉక్కుపై కుట్రలను తిప్పికొడతాం

మోడీ, అదానీ కుయుక్తులను సాగనివ్వం - వామపక్షాలు వెల్లడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అస్థిరపాలుజేస్తున్న మోడీ, అదానీ కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ముందుకు రావాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు అధ్యక్షతన శనివారం జగదాంబ దరి సిపిఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై ఏది లాభం అయితే అది చేస్తామని ప్లాంట్ అమ్మకపు చర్యలను బలపరిచిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి వ్యాఖ్యలను ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. అబద్ధపు ప్రచారాలు కట్టిపెట్టాలని హెచ్చరించింది. ఈ సమావేశంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, ఎంసిపిఐ నాయకులు కె.శంకరరావు, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు కె.దేవా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు వి.కృష్ణారావు, వై.రాజు, జి.పోలేశ్వరరావు, ఈశ్వరరావు మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను ఏ ఒక్కటీ అమలు చేయకుండా తప్పుడు ప్రచారానికి బిజెపి నూతన అధ్యక్షురాలు పూనుకున్నారని విమర్శించారు. విశాఖకు ఆర్థిక పునాదిగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ బిజెపి అదానీ, అంబానీ వంటి బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే చర్యలకు ఉపక్రమించిందన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి విధ్వంసక చర్య నుంచి విశాఖను కాపాడుకోవాలని ప్రజలకు నేతలు పిలుపునిచ్చారు. అదానీతో కేంద్రంలోని బిజెపి సర్కారు కుమ్మక్కయి స్టీల్‌ప్లాంట్ ఉత్పతికి తీవ్ర ఆటంకాలు సృష్టిస్తోందని తెలిపారు. గంగవరం పోర్టులోకి ప్లాంట్‌కు సంబంధించిన కొకింగ్ కోల్ దిగుమతి చేయకపోవడం, దిగుమతి అయిన బొగ్గును రకరకాల కారణాలు చూపి సకాలంలో ప్లాంట్‌కు చేరవేయకుండా ఆటంకాలు కల్పించడం దారుణమన్నారు. బిజెపి, అదానీ కలిసి ఈ దుర్మార్గ చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. గతంలో గంగవరం పోర్టు స్టీల్‌ప్లాంట్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని కూడా ఉల్లంఘించి బకాయి పేర ప్లాంట్‌కు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తక్షణం గంగవరం పోర్టు నుంచి అదానీని గెంటి వేయాలని, రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని 1100 ఎకరాల భూమి ఇచ్చినందుకు ప్లాంట్‌కి సముచిత భాగస్వామ్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్లాంట్‌ను దివాళా తీయించే చర్యలను విడనాడాలని డిమాండ్ చేశారు. అమ్మకపు చర్యలు ఉపసంహరించి అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చాలన్నారు. వాల్తేర్ రైల్వే డివిజన్‌ను విశాఖ రైల్వే జోన్‌లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ మెట్రో రైల్వే నిర్మాణానికి ఇప్పటికైనా నిధులు కేటాయించాలన్నారు. రెండు రోజుల క్రితం పార్లమెంట్‌లో అటవీ హక్కుల సంరక్షణ సవరణ బిల్లును ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించినా లెక్కచేయకుండా బిజెపి ఆమోదింపజేసుకోవడం దారుణమన్నారు. నూతన చట్టంతో ఆదివాసీలకు అడవిపై హక్కు లేకుండా పోతుందని తెలిపారు. అటవీ హక్కులు, భూములు, గనులు, సంపద మొత్తం కార్పొరేట్ల పరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుష్ట చర్యకు వ్యతిరేకంగా ప్రతిఘటనోద్యమం నిర్మిస్తామని వెల్లడించారు.



సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

పోర్టు భూములను రహేజాకు అప్పగించడంపై నిరసన

ప్రజాశక్తి - సీతమ్మధార : విశాఖ పోర్టు ట్రస్టు భూములను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రహేజా సంస్థకు ధారాదత్తం చేయడాన్ని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన శనివారం సాలిగ్రాంపురంలోని విశాఖ పోర్టు భూముల వద్ద నిరసన తెలిపారు. పోర్టు స్థలంలో ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని విరమించుకోవాలని సిఎం జగన్మోహన్ రెడ్డిని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ విశాఖ పోర్టుకు చెందిన వందల కోట్ల విలువ చేసే 17 ఎకరాల భూములను నరేంద్ర మోడీ తన అనుచరుడైన రహేజాకు కట్టబెట్టారని మండిపడ్డారు. అలాగే అక్కయ్యపాలెంలో 16 ఎకరాల్లోవున్న పోర్ట్ స్టేడియం, ఇండోర్ స్టేడియం, కళావాణి ఆడిటోరియంలను కూడా బడా వాణిజ్య సంస్థ పరం చేశారన్నారు. ఈ దుర్మార్గ చర్యలను వ్యతిరేకించాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోడీతో కుమ్మక్కై ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. పోర్టు అభివృద్ధికి లేదా విశాఖ ప్రజల అభివృద్ధికి ఉపయోగించాల్సిన ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం అన్యాయమన్నారు. ఈ విషయమై సిఎం నోరుమెదపకపోవడం శోచనీయమని అన్నారు. ఇప్పటికే విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా నికరంగా పోరాడటం లేదన్నారు. ఇనార్బిట్ మాల్ వల్ల విశాఖలో ఉన్న వేలాది చిన్న, మధ్య తరహా వ్యాపార, వాణిజ్య సంస్థలు తీవ్రంగా దెబ్బతింటాయని అన్నారు. పెద్దఎత్తున ఉద్యోగాలు పోతాయని గంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ పాల్గొన్నారు.

8న విశాఖకు చంద్రబాబు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్రతో పాటు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులను అధికార వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గండి బాబ్జీ ఆరోపించారు. శనివారం టిడిపి కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ ఆగస్టు 8న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుపై పోరాటానికి చంద్రబాబు వస్తున్నారని తెలిపారు. ఆ రోజు మాడుగుల, చోడవరంలలో సభలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. టిడిపి ప్రభుత్వం ఉండగా రూ.780 కోట్లును సుజల స్రవంతికి కేటాయిస్తే, జగన్ ప్రభుత్వం కేవలం రూ.13 కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. పోలవరం పూర్తయి వుంటే 23.4 టిఎంసిలు 30 లక్షల ఎకరాలకు అందేదన్నారు. ఇరిగేషన్ మంత్రి పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో తెలీదని చెప్పడం సిగ్గుచేటన్నారు.


వరినాట్లు వేస్తున్న మహిళలు

వరినాట్లు ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని నల్లగొండ గ్రామంలో చింతపల్లి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ జైతి రాజులమ్మ శనివారం వరినాట్లను ప్రారంభించారు. వర్షాలు కురవడం, వరి నారుమళ్లు ఎదగడంతో గ్రామాలలో పూర్తిస్థాయిలో రైతులు వరి నాట్ల పనిలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఆమె వరినాట్లు వేశారు.

జగనన్న కాలనీల పరిశీలన

ప్రజాశక్తి - కొయ్యూరు : జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపుమేరకు శనివారం మండల కేంద్రంలోని జగనన్న కాలనీలను జనసేన నాయకులు లక్ష్మణరావు, బుజ్జిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శివారులలో 17 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, నాలుగేళ్లు దాటినా అక్కడ ఒక్క ఇటుక పేర్చలేదని తెలిపారు. ఇది వైసీపీ ప్రభుత్వ వైఫల్యమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నేతలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీలేరు : అపోలో హాస్పిటల్ డాక్టర్స్ సొసైటీ సౌజన్యంతో సీలేరులో రామాలయం సెంటర్లో ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు న్యూరో ఫిజీషియన్ వైద్య నిపుణులు రాజేష్ వెల్లడించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ శిబిరంలో ఆంకాలజీ, ఆర్థోపెడిక్స్, జనరల్, ఫిజియోథెరఫీ, గ్యాస్ట్రో ఎంట్రోలాజీ, వాస్క్యులర్ సర్జరీ సంబంధించిన వైద్య నిపుణులు పాల్గొంటారని పేర్కొన్నారు. సీలేరు పంచాయతీ పరిధితో పాటు చుట్టుపక్కల ప్రజలు శిబిరానికి హాజరు కావాలని కోరారు. ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. వ్యాధి తీవ్రతను బట్టి రిఫరల్ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని అంతాడ పంచాయితీ పరిధి ఎద్దు మామిడి గ్రామంలో వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేశ్, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుర్ల చందర్రావు, వైసిపి నాయకులు సెగ్గె బాలరాజు, సెగ్గె నూకరాజు, భీమరాజు, సత్య, పవన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విస్తృత గాలింపు చర్యలు

ప్రజాశక్తి - సీలేరు : మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నేపథ్యంలో స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యాన శనివారం సీలేరు పోలీస్ స్టేషన్ పరిధి ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. వాహన తనిఖీలు చేపట్టి వారి వివరాలు సేకరించి విడిచిపెట్టారు. అనుమానిత వ్యక్తులపై దృష్టి సారించారు. సీలేరులో అపరిచిత వ్యక్తులు వస్తున్నారా లేదా అని గోప్యంగా ఆరా తీశారు. సీలేరు జల విద్యుత్ కేంద్రం స్థానిక ప్రభుత్వ కార్యాలయాలకు మావోయిస్టు నుంచి ఎటువంటి ముప్పు కలక్కుండా పోలీస్ నిఘా పెట్టారు.

భూ పరిమాణంలో మార్పులు ప్రమాదకరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రోజు రోజుకూ భూమి పరిమాణం చిన్నదిగా మారుతోందని, అందువల్ల ప్రకృతిలో అనేక మార్పులు సంభవించి సకల జీవరాసుల ప్రాణాలకూ హాని తప్పదని నగరానికి చెందిన బి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 దశాబ్దాల క్రితం విశాఖ నగరంలో 32 డిగ్రీల వేడి గరిష్టంగా ఉంటే, ఇప్పుడది 40 డిగ్రీలకు చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు.